teluguislam.net



# ముందుమాట

ప్రసంగ కళ ప్రాచీన కాలం నుండి ఒక ప్రసిద్ధి చెందిన కళగా వస్తున్నది. ఈ కళ మానవుని మనుగడ నుంచి ప్రారంభమైనది. అరబ్బులు ఈ కళలో విశిష్ట పీఠం వేశారు. కాని ఇస్లాం ధర్మము ఈ కళను అరబ్బులలోనే కాకుండా యావత్ ప్రపంచంలో విస్తరింపజేసింది. జుమా ఖుత్బాలను తప్పనిసరి చేసి ఇస్లాం ధర్మము ప్రసంగ కళను ఉన్నత శిఖరాలకు చేరవేసింది.

తద్వారా ప్రతి కాలంలో, ప్రతి భాషలో అనేకమంది ప్రసంగీకులు ఖ్యాతి గడించారు. వారి ప్రసంగాలకు రచన రూపం ఇవ్వటం జరిగింది. చాలా పుస్తకాలు ప్రచురింపబడి మార్కెట్‌లోకి వచ్చినవి. కొన్ని పుస్తకాలు ప్రత్యేకించి జుమా ప్రసంగాల కోసమే ప్రచురించబడ్డాయి. అల్లామ దావూద్ రాజ్ రహిమహుల్లాహ్ గారి ఖుత్బాతే నబవీ కూడా ఈ కోవకే చేరినది. ఇది చాలా కాలం నుంచి అహ్లెహదీస్ మస్జిద్‌ల మెంబర్ల అలంకరణగా ఉన్నది. చాలా మంది ప్రసంగీకుల పఠన పుస్తకాలలో ఈ పుస్తకం ఉన్నది. అంతేకాదు కొంతమంది ప్రసంగీకులు మెంబరు పై ఈ పుస్తకాన్ని చూసి ప్రసంగం చేస్తున్నారు.

జుమా ప్రసంగం చేయడానికి లేదా ప్రసంగం కొరకు సిద్ధం అవటానికి తెలుగు భాషలో ఒక్క పుస్తకం కూడా ఉండేది కాదు. మర్కజ్‌దారుల్‌బిర్ పెదన ఉపాధ్యాయులు దీని వైపు దృష్టి సారించారు. వారందరి సలహాలనంతరం అల్లామ దావూద్ రాజ్ రహిమహుల్లా గారి ఖుత్బాతే నబవిను కొన్ని ప్రత్యేకతల వలన తెలుగులో అనువదించడానికి ఎంపిక చేయటం జరిగింది. ప్రత్యేకించి తెలుగువారి కొరకు ఈ పుస్తకం అనువైనదిగా భావించడం జరిగింది. ఎందుకనగా ఈ పుస్తకంలోని ప్రసంగాలు సంక్షిప్తంగా సరళరీతిలో అర్థమయ్యేలా ఉన్నాయి. సాధ్యమైనంత వరకు ఈ పుస్తకం జయీఫ్ హదీసులకి దూరంగా ఉన్నది. జీవన విధానానికి సంబంధించిన అన్ని విషయాల గురించి ప్రసంగాలు సమకూర్చటం జరిగింది. జ్ఞానపరంగా ధార్మిక పండితుల వద్ద ఉన్నత స్థానాన్ని పొందినవి.

దీని మూల రచయిత అల్లామ దావూద్ రాజ్ రహిమహుల్లా గారు ఆయన చేసిన కృషిని ఈ విధంగా వివరించారు. ఏ మస్జిద్‌లలో జుమా ఖుత్బాలు ఉర్దూలో అయ్యేవో అక్కడ సంక్షిప్తంగా సరళరీతిలో ఖుర్‌ఆన్ హదీసుల పరంగా అర్థమయ్యే విధంగా ప్రసంగాలు గల ఎటువంటి పుస్తకం ఉండేది కాదు. ఇంకా చాలా కారణాలు దృష్టిలో పెట్టుకుని స్నేహితులు పట్టుపట్టడం వలన నేను 23 సం॥ల ముందు తయారు చేసిన పథకము గురించి దీర్ఘ ఆలోచన చేశాను. దుఆ చేస్తూ ఉన్నాను. చివరికి అల్లాహ్ పై నమ్మకం పెట్టుకుని ఈ మహత్తర సేవ కొరకు తయారయ్యాను.

ప్రతి నెల మన మాస పత్రిక అయిన 'వెలుగు కిరణాలు'లో ఒక అంశమును తెలుగులో అనువదించి ప్రచురించాలని నిర్ణయం తీసుకున్నాము. తద్వారా ప్రతి నెల ఈ ప్రసంగాలు ప్రచురితమయ్యేవి. వీటి ద్వారా తెలుగు మాట్లాడే ప్రసంగీకులు చాలా మంది పూర్తిగా లబ్ధి పొందటం గ్రహించాము. కాని వెలుగు కిరణాలు మాస పత్రిక ఆగిపోవటం వలన ఈ కార్యము ఎంతో కాలం సాగలేదు.

మిగిలిన కార్యమును పూర్తి చేయడానికి మన మర్కజ్ దారుల్‌బిర్ పూర్వ అధ్యాపకులైన గౌరవనీయులైన ముహమ్మద్ హమ్మాద్ ఉమ్రి హఫిజహుల్లా గారికి ఈ బాధ్యతను అప్పగించటం జరిగింది. అల్‌హమ్‌దులిల్లాహ్ ఆయన కృషి వలన 60 ఖుత్బాలలోంచి (ప్రసంగాలు) 37 ఖుత్బాలు పూర్తి అయినవి. అవి మొదటి సంపుట రూపములో మీ చేతిలో ఉన్నవి. మిగిలిన ఖుత్బాల పని కూడా కొనసాగు తున్నది. అది తొందరగా పూర్తి అవుతుందని అల్లాహ్‌పై నమ్మకం ఉన్నది. అది పూర్తయిన తరువాత ఇన్‌షా అల్లాహ్ రెండవ సంపుటము రూపములో ప్రచురించబడుతుంది. ఈ కుత్బాలను ఎడిటింగ్ చేయడంలో అబ్దుష్షకూర్ ఉమరి గారి సహకారం కూడా ఉన్నది. అల్‌బసీర్ గ్రాఫిక్స్ వారు ఈ పుస్తకమును నిర్ణీత సమయానికి ప్రచురించి మన ముందుకు తీసుకురావటానికి పూర్తి సహకారాలను అందించారు. అల్లాహ్ తఆలా అందరి కృషిని స్వీకరించు గాక. ఆమీన్

**డా॥ సయీద్ అహ్మద్ ఉమరీ, మదని**
మర్కజ్‌దారుల్‌బిర్ కార్య నిర్వాహకులు
జమియతె అహ్లె హదీస్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు.